అత్తయ్య వచ్చింది!

నవ్వులకైనా, కలలోనైనా ఊహించని సంఘటన ఒకటి జరిగితే ఎదురయ్యే ఆశ్చర్య మెంతటిది? సరిగ్గా అలాంటి ఆశ్చర్యానికి గురిచేస్తూ — ఏనాడో మనసులు విరిచి, మమతలు తెగతెంచుకు వెళ్ళిన మా నవనీతం అత్తయ్య మళ్ళీ నా పెళ్ళికి వచ్చింది.

నిలువుటద్దం ముందు, నిగనిగలాడే కృష్ణసర్పంలాంటి తెగబారెడి వాల్జడ వైపు చూచి మురిసిపోతున్న సమయంలో వాత్సల్యాన్నంతా ఒలక బోస్తూ, "రాధా!" అంటూ వచ్చింది.

ఉసూరుమని నిన్న ఉదయం వచ్చిన అత్తయ్యకు, ఈమెకు పోలిక లేవు. ఏదో క్షణికంగా తప్పిస్తే, అనునిత్యమూ చిత్తమూ, చలనమూ లేని జడపదార్థంలా పడి ఉండటం ఆమె స్వభావానికి విరుద్ధం. లేకపోతే, జీవితంలో ఏ ఆడదానికీ ఎదురుపడ కూడని సన్నివేశం తటస్థించినా అంత గుండెనిబ్బరంతో ఉండగలిగేది కాదు. అలాంటిది. . . గృహస్థమైన ఏవో కొన్ని ఒడిదుడుకులను కడుపులో దాచుకొని, నన్నింత అభిమానంగా పలకరించటంలోగల అపౌచిత్య మేముంది?

ఆ మాటకొస్తే ఈ రకమైన పిలుపులు నాకు కొత్తవి కావు. బాల్యాన్ని అతిక్రమించి యవ్వనం తొలి ఉడుపులు కడుతున్న రోజులనించీ వినవస్తున్నవే! ఒకనా డిలాగే అద్దం ముందు నిల్చొని కలల కడలిలో అనుభూతుల పడవమీద ఆనందతీరాలకు సాగిపోతు న్నప్పుడు నా తొలి యౌవనాన్ని ఎంత చక్కగా సమీక్షించింది!

"ఒసే, రాధా! నేనే నీ ప్రాయపు పడుచుపిల్లడినైతే నిన్ను పచ్చి జామి కాయలా కొరుక్కుతినే వాడినే! నీ కనుముక్కు తీరూ, ఒడ్డూ పొడవూ, లావణ్యమూ. . . మగవాడి వరకూ ఎందుకూ? నన్నే సమ్మోహనపరుస్తున్నాయే!. . . అందం గురించి కవులు కావ్యాల్లో వర్ణించి ఉంటే ఏహా అనుకున్నాను. ఇంతటి మైమరుపు కళ్ళెదుట కనిపిస్తూంటే. . . కవులే గాదు, కవిగానివాడుకూడా రసావేశంతో కలం పట్టక ఏం చేస్తాడే?"

మనసులో ఒకటీ, పైకొకటీ చెప్పటం నా చేతకాదు. అలాంటి తలపులు తలుపులు తెరిచినప్పుడల్లా నాలో ఉప్పు, కారం తిన్న రక్తం వెచ్చవెచ్చగా ఉరకలు పెడుతూంటుంది! క్షణంసేపు కంపన, హృదయస్పందన — ఈ లోకంలోని మధురానుభూతులన్నీ నావేనని మైమరిచి పోతాను.

". . . ఎంత ఎదిగే ప్రాయమైనా ఒకే ఒక సంవత్సరంలో నీలా ఇంత ద్విగుణీకృతంగా మారిపోయిన వారిని నే చూడలేదే, రాధా!"

నిజమే! ఈ మాటే చాలామంది అన్నారు. వారి వరకు ఎందుకు? నా అంతట నేనే అనుకున్న క్షణాలు ఎన్ని లేవు? అప్పు డిక తెగించి ఎవరి కళ్ళలోకీ చూచే ధైర్యం నా కుండదు. అలాంటిది. . . అత్తయ్య కళ్ళలోకి చూడాలంటే సామాన్యమా? ఒడుపుగా వేళ్ళతో ముఖం కప్పి చాటు చేసుకున్నాను. నే నేది పసిగట్టకూడ దనుకున్నానో అదే పసి గట్టింది.

**ప్రేమించడం తప్పని ఎవరూ అనలేరు – ప్రేమించకుండా ఎవరూ ఉండలేరు కనక. ఎంతటి అప్రాచ్యుడు అయినా ప్రేమించవచ్చు. అయితే ఆ ప్రేమ ప్రేమగా ఉండక వివాహానికి ముందుగానే మరో ప్రాణికి జన్మ ఇచ్చే ప్రమాదం తెచ్చిపెట్టితే— అందులోనూ ఆ అప్రాచ్యుడు మృత్యు ముఖంలో చిక్కుపడితే? అలుసిచ్చి అలాంటి ప్రమాదం తెచ్చుకొన్నప్పటికీ ఆ ఆడదాని గతేమిటి?**

"అయినా, మా కాలంలో ఇలాంటి విడ్డూరాలు నే నెరగనమ్మా. బంధం వేసినవాడు అధికారంతో ఆశగా మీద చేయి వేసినా మా చెంపల్లో కెంపులు మెరిసేవి గావు భయంతోనే హడిలి చచ్చేవాళ్ళం. ఇప్పుడా? కన్నెపిల్లలకు ఆ తలపు వస్తేనే చాలు, ఈ లోకమే నాది గాదనుకుంటారు!"

పరకాయ ప్రవేశాల్లాంటి అతి తాంత్రిక విద్యల్లో నమ్మకమున్నా లేకపోయినా, మనిషిని నిలిపి మనసును ఎక్స్-రే తీసేయగల నేర్పులో అత్తయ్య పట్ల నాకు పరిపూర్ణ విశ్వాస ముంది. ఆమె నలా స్వేచ్ఛగా వదిలేస్తే వచ్చే చిక్కు గొప్పదే. ఆవలించకనే పేగులు లెక్కబెడితే ఎలా మరి?

"మాటలు నేర్చావులే, అత్తయ్యా! కన్నెపిల్లల్ని ఉడికించటమంటే నీ కెందుకింత సరదా?!"

లాభం లేదని అడ్డు తగిలాను. అయినా . . . ఇది ఆమెను అడ్డుతగలటానికి చేసిన ప్రయత్నమేనా? హతోస్మి...

లాగినమాటలు తెగకముందు నిలవడం అత్తయ్య ప్రత్యేకత. నా సందేహాన్ని గుర్తెరిగి, పెదవి విరుపులోంచి పరిహాసం చిందించింది. అలా చరియల వెంట నడిచే కొండగాలిలా సన్నగా నవ్వితేగానీ నాకు ధైర్యం చిక్కదు.

మమకారాన్నంతా బంధంలో ఇముడ్చుకొని గాఢంగా కౌగిలించుకుంది. నిమిషం తరవాత వేరు చేశాను. నా అనుమానమే నిజమైంది! ఆమె కంట తడిపెట్టింది.

"అత్తయ్యా. . . ఏడుస్తున్నావా? . . ." అడిగాను.

"లేదమ్మా! అలా ఎందు కనుకున్నావు? నీకు దుఃఖానికీ, ఆనందానికీ తేడా తెలీదని తెలిసిపోయింది. అయినా ఈ కన్నీళ్ళు దుఃఖంతో పొంగివచ్చినవా? కావు. . . సంతోషంతో తొణికి వచ్చినవి. ఆనందబాష్పా లంటారే అవి నువ్వెరగవా?" అని, "మించినదేమీ లేదు. అద్దంలో చూడు. అవి ఎలా ఉంటాయో ఇప్పటికైనా నీ కళ్ళలో నీవే చూడగలుగుతావు!" అంది.

అత్తయ్య మాటే ముంజేతి కంకణంలా ఉంటే, ఇక దానికి వేరే అద్దమేల!

కనుగొలుకులలో నిలిచిన ఆనంద బాష్పాలను తుడుచుకొంటూ, "ఏమో, అత్తయ్యా! ఇంత తియ్యని కబుర్లు చెప్పి, కాలం విలవను మరిపించే దానివి. . నీ నీడలో నా కింత చోటివ్వలేకపోయావు. ఆ లోటు జీవితాంతం ఉండనే ఉంటుంది. . ." అన్నాను.

డొంకంతా కదలటానికి సూత్రప్రాయమైనది తీగ. నే నవాలోచితంగా దాన్ని లాగేనేమో! ఆమె బరువుగా వెనుదిరిగింది అప్పుడే అమ్మ ప్రవేశం కూడా జరిగింది.

"మనుషులకు కేవలం స్వార్థమే ప్రధానమూ, సర్వస్వమూ అయితే, బంధాలనూ, బాంధవ్యాలనూ ఎవరు గుర్తిస్తారే, పిచ్చిపిల్లా! ఈ లోకంలో కల్లబొల్లి మాటలతో మంచి తనపు బురఖా తగిలించుకుని చలామణి అయ్యేవారు చాలామంది తయారయారు. వారిలో మీ అత్తయ్యకు





చోటు లేదనుకొనేవు! ఆమె పుట్టుకకు మాత్రమే మానవమాత్రురాలు. . ."

ఎప్పుడూ అంత తీవ్రంగా మాట్లాడని అమ్మ వాలకానికి ఆశ్చర్యమూ, చిన్నబోయిన అత్తయ్యను జూచి దుఃఖమూ కలిగాయి నాకు. అయినా,



# వెలుగులు

## వి. అబ్దుల్ ఖాదర్

అమ్మ మాటలు పూర్తిగా నిజం కావని కొట్టి పారేయదగినవి కావు. దాని వెనక ఎంతయినా ఉంది.

• •

మాది ఒకప్పుడు సంపన్న కుటుంబం. మమ్మాశ్రయించి సుఖంగా కాలం వెళ్లదీసిన కుటుంబాలు లెక్కకు చాలా ఉన్నాయి. వాటిలో అత్తయ్యది కూడా ఒకటి. ఆమె సుపుత్రుడు భానుమూర్తి చదువంకుగా... అమ్మకు తెలిసి కొంతా, తెలియక కొంతా మార్లు, వేలు ధారబోశాడు నాన్న. చిన్నప్పటినుంచీ నన్ను తన కోడలిని చేసుకుంటానంటూ వచ్చింది అత్తయ్య. బావకు పట్టపుచదువులు పూర్తికాగానే నిశ్చయ తాంబూలాలు కూడా పుచ్చుకున్నారు. కానీ, తీరా పెళ్లి వారం పది రోజులు ఉందనగా అత్తయ్యనించి వచ్చిన ఉత్తరం మరో తీరని సంచలనాన్నీ, ద్వేషాన్నీ రగిలించింది.

"అన్నయ్యా. . .

మొదటినుండి నా మనస్తత్వం నువ్వెరగనిది కాదు. ఈ ప్రపంచమున్నదే—ఇందులో డబ్బు లేని వాడు ఎందుకూ కొరగాడని చాలాసార్లు నీతో వాదించి ఉన్నాను. డబ్బులో ఏముందని నీ వంటావేమో! నీకు దాన్ని సంపాదించటం వరకే తెలుసు. అనుభవించటం ఏం తెలుసు? డబ్బులో అంద ముంది. అంతులేని ఆనంద ముంది. అసలు మానవుని ప్రతి కదలికకూ జీవనాడి లాంటిదీడబ్బు. క్షేత్రాన్ని సస్యశ్యామలం చేసే పంటకాలువలా—అది మనిషి జీవితాన్ని పచ్చగా, పచ్చల తాపడంలా మార్చివేస్తుంది. అంతెందుకూ? 'ధనమూలమిదమ్ జగత్' అని నువ్వు వినలేదా!

మడికి గట్టు కట్టి నీళ్లు పోకుండ కాపాడవచ్చు. ఇంటికి అప్పులుండి గుట్టు దాచటం అంత తేలికైన పనిగాదు. అన్నయ్యా, ఆస్తినంత తెగనమ్మినా తీరని అప్పులు మీకున్నాయని ఎవరికీ తెలీదనుకోకు. తగిలిన గాయానికే తగిలేటట్టు. . . ఈ ఏడు వ్యాపారాది విషయాల్లోకూడ భారీ ఎత్తున నష్టాలు వచ్చాయి. జీవితంలో చెడి బతకవచ్చు కానీ బతికిచెడేంత నికృష్టత మరొకటి వద్దు. అయినా ఓడలు బండ్లూ, బండ్లు ఓడలూ అవగాలేంది, పూలమ్మిన చోట కట్టెలమ్మగా ఎంతలే. . .

బహుశా మీ కిది తెలిసి ఉండదు ఇప్పుడు మేము ఉన్నవాళ్ల కిందే లెక్క. పాతికెకరాల పల్లం, బాంక్‌లో అర లక్ష రొఖ్ఖం, అందులో సగం ఖరీదు చేసే రెండిళ్లూ ఉన్నాయి. కాబట్టి ... తెలిసీ చెడిపోయిన కుటుంబంతో వియ్యమందటం నా కిష్టం లేదు. అది మా హోదాకుకూడా తగినపని కాదు. అందుకే మాపై ఎలాంటి ఆశలూ పెట్టుకోవద్దని ముందుగానే హెచ్చరిస్తున్నాను. లక్షణంగా మీ ప్రయత్నమేదో మీరు చేసుకోండి.

పోతే, భానుమూర్తికి 'పాతిక వేలు కట్నంతోబాటు అమెరికాలో పై చదువులకయ్యే ఖర్చు యావత్తూ మేమే భరించగల'మని ఓ గొప్పింటి సంబంధం వచ్చింది. కొన్ని కారణాంతరాలవల్ల పెళ్లికూడా వెంటనే జరిపించవలసి వచ్చింది. పెళ్లికి ముందే శుభలేఖ అందజేసే ఆనవాయితీకి విరుద్ధంగా, ఆ శుభఘడియ కాస్తా అయిన తర్వాత మీ కీ వివాహాహ్వాన పత్రిక పంపిస్తున్నాను. మీ యావన్మందినీ పెళ్లికి పిలిచే అవకాశం లేకపోయినందు కేమీ అనుకోరని భావిస్తూ.

* * *

నీటిబొట్టు విలువ తామరాకుమీద ఉన్నంత వరకేనేమో!

ఎంతో కలుపుగోలుతనంగా పూసుకు తిరిగినా అత్తయ్యను ఒకరూ పలకరించ లేదు. అసలామె ఉనికే ఎవ్వరికీ సహించినట్టు లేదు.

ఇల్లంతా వెదికి మేడమీద గదిలోకి వెళ్లాను. అక్కడ మోకాళ్లమీద తల ఆన్చి కౌజుపిట్టలా ఒదిగి రోదిస్తూంది. క్రూరమైన నిస్సహాయ స్థితిలో ఆత్మీయులపై కలిగే అభిమాన మెంతటిది? నా మనసు జాలితో ప్రిదిలిపోయింది.

"ఈ ఇంటిలో అనునిత్యమూ వెలిగే చమురు ప్రమిద లున్నాయి. దీపస్తంభా లున్నాయి. అధునాతనంగా అమర్చిన మెర్క్యురీ దీపా లున్నాయి. కానీ అత్తయ్యా! నువ్వు లేనిదే నాకు వెలుగే కనిపించలేదు. సందడితో చేసిన బొమ్మల్లా కింద అందరూ పడయాడుతుంటే, సాఫీగా గాలైనా రాని ఈ చీకటికొట్టులో నువ్వేం చేస్తున్నావు?" అన్నాను.

ఎందుకో, ఏమో బావురుమంది.

సామాన్యంగా వాసననిబట్టి పూవు పేరు చెప్పవచ్చు. మునుపటి విషయాని కేంగానీ ఇప్పటి అత్తయ్యలో కపటమూ కార్పణ్యమూ ఉన్నట్టు తోచదు. పెద్దలు పిల్లల ఇంగితాన్ని తక్కువగా అంచనా వేయటం పరిపాటే కావచ్చు. చోసిలిలోని విశుద్ధజలానికీ, దోమలు పారాడే మురుగునీటికీ భేదం తెలీని అవివేకురాలిని కాదు నేను.

అత్తయ్యలో ఈ రెండు రోజులుగా చాలా అరుదైన విషయాలు చూస్తున్నాను. పిలిస్తే పలికే కలకంఠి కన్నీళ్లా. . . కానీ, అత్తయ్య విషయంలో అలా కాదు. స్వయంగా కన్నీళ్లు వచ్చి పిలిచినా, ఆమె [illegible] పలకదు. అంతటి దీపితి. . . [illegible] వేలిగా శోకించు[illegible]! [illegible]



కోటి విద్యుత్తైన... ఫోటో—వి. జయప్రకాష్

సాధ్యం? ఎండమావిలో జల ఆపంభవ మనుకొన్నానే!... అయినా, శీతోష్ణస్థితి బారికి కఠిన పాషాణాల్నంటివే కరిగి పోతుంటే కేవలం తెగితే ఒలికే రక్త మాంసాలతో కూడిన పిడికెలంత హృదయ మెంత?

"అమ్మడూ, రాధా! నేను భరించలేకపోతున్నాను. మీ అమ్మా, నాన్నా, అన్నయ్యా నన్ను వెలివేసినట్టు చూస్తున్నారు. కళ్లారా నీ పెళ్లి చూచి వెళదామని కొండంత ఆశతో వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చిన తరవాత ఆ కోరిక తీరేదిగాదని తేలిపోయింది. ఇలాగే. . . ఇంక నాలుగు మాటలంటే, నీ పెళ్లి పూర్తి అయ్యే వరకూ నే నుండ లే నేమో, తల్లీ!..."

"అవేం మాటలే, నవనీతం!... ఇక్కడ విన్నెవరో కొరుక్కుతిన్నట్టు మాటాడేస్తున్నావే? చేసిన నిర్వాకం చాలక పైగా మా కీ అపనిందలు కూడా ఒకటా! బాగానే ఉంది. నీ వరస చూస్తుంటే పిల్ల పెళ్లి ఇప్పుడైనా సాఫీగా జరగనిచ్చేట్టు లేవే!. . ."

చేతులు గాలిలో తిప్పుతూ సాభిన యంగా చెప్పుకుపోతున్న అమ్మ ఎప్పుడు వచ్చిందో నేను గమనించనే లేదు!

అగ్నికి ఆజ్యంలా ఇంతలో అన్నయ్య కూడా దాపరించాడు.

"నీ ముఖం చూస్తుంటే ఒళ్లు మంటలు పుట్టుకు వస్తుంది. అసలు పిలవని పేరంటానికి సిగ్గూ ఎగ్గూ లేకుండా ఎందుకొచ్చావు? మేము బతికి చెడినప్పుడు నీ కంటికి నలుసులా కనిపించాము. ఏదో ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్నామని మళ్లీ మా పంచ జేరావా? మాతో తెగతెంపులు జేసుకున్న దానివి మళ్లీ ఏ ముఖంతో ఈ గడప తొక్కావు? పుడితే చాలా... వెధవ పుట్టుక. థూ!. . ."

"అన్నయ్యా!. . ." ఆవేశంతో అరిచాను.

"ఏమమ్మా. . . నీ కేం మత్తు మందు జల్లింది? ఆ మాయమాటలకు లొంగిపోయి, ఇంతకుముందే నీ జీవితాన్ని దుఃఖభాజనం చేసుకొన్నావు. చాలదా? అయినా. . మ న్నామెన ఎందుకు వెనకేసు కొస్తున్నావో నా కేం తెలియటం లేదు. ఒకటి గుర్తుంచుకో!. . .పడగ నీడ కన్నకు క్షేమదాయకం కాదు. . ."

"అలా అడగరా, అబ్బాయ్!" అమ్మ ముక్తాయింపు.

గుమ్మంలో నిలబడిపోయిన నాన్న కళ్లద్దాలు సవరించుకున్నాడు. అందరిలా అది ఆయన కొక అలవాటు కాదు. దుఃఖం పొంగి, కన్నీళ్లు కనుగొలుకులకు వస్తేగానీ అలా సవరించుకోడు.

"ఇల్లు తొక్కి వస్తే శత్రువునైనా మన్నించాలి మనం. ఆ మాత్రం ఇంగితజ్ఞానం మీ కెందుకు లేక పోయిందో నా కర్థం కావటం లేదు. ఉద్ధరించార్లే. . . ఊరుకోండి. . ." అని మందలించాడు. అత్తయ్యవైపు తిరిగి, "వాళ్ల మాటలకేంలే—చెల్లెలా! అవి పై మొయిలు చినుకులు. మొరిగే కుక్కలు కరవడానికి సాహ సించవుగా!... నీ రాధ పెళ్లి స్వయంగా నీ చేతులమీదుగా జరిపించు. పెళ్లి కూతురుగా రేపు దాన్నెలా ముస్తాబు చేస్తావో మరి. . . ఏదీ, నా కళ్లలోకి సూటిగా చూచి ఓ చిరునవ్వు వెలి గించు" అన్నాడు.

తీవ్రారోహణ క్రమంలో పడిన జంత్రీవాయిద్యంలా పులకరించి పోయింది అత్తయ్య.

ఆ మాటల కామె ఎంత పొంగి పోయిందో, అమ్మా, అన్నయ్యా అంత కుంగిపోయారు. కానీ, దురదృష్ట వశాత్తు ఈ అంచనాను అస్తవ్యస్తం చేస్తూ నాన్నగారి ప్రసంగం మళ్లీ పొడిగించబడింది.

"నవనీతం! ఇవి, ఈ రెండు మాటలు. . . రక్తసంబంధాన్ని తెంచు కోలేని నీ జానకిరామ్ అన్నయ్య అన్నవి. నాడు లేమిలో మిగిలి, కన్నబిడ్డకు అయిన సంబంధం దారుణంగా తప్పి పోయినప్పుడు ఒక ఆడబిడ్డ తండ్రి అడగవలిసిన మాటలు. . . గుండెల్లో ఇంకా మండుతూనే ఉన్నాయి . . ."

అత్తయ్య వంతు అమ్మ, అన్నయ్య లకు దక్కి; అమ్మ, అన్నయ్యల వంతు నాకు మిగిలింది.

నల్లేరుమీదగాదు, నాపరాళ్ల మీద బండి నడకలా ఆయన చెప్పుకు పోతున్నాడు.

"ఈ ప్రపంచానికి మనుషులు శాశ్వతంకారు. నలుగురూ మెచ్చే మనుగడే నరుని జన్మకు సౌరభాన్నీ, సార్థక్యాన్నీ ఇస్తుంది. చీమా, దోమా, పురుగూ పుట్రాలాంటి క్రిమికీటకాదులూ, పశు పక్ష్యాదులూ ఈ భూమిమీద బ్రతుకు సాగిస్తున్నాయి. కానీ...మనిషికీ, ఇతరా లకూ వ్యత్యాసం లేని బ్రతు కెందుకూ? ఉన్న బ్రతుక్కి ఒక్క 'పేరే' ప్రధానమని నేను భావించను ...

"నువ్వు స్వయానా నా తోడబుట్టినదానివి. ఏదో పిచ్చివాగుడు తప్పిస్తే ఈ సిరిపట్ల ని కింత వ్యామోహం ఉండనుకోను. ని న్నాదు కొన్నప్పుడూ, కుదరదన్నప్పుడూ నీలో సమరసభావాన్నే చూడగలిగాను. నా చెల్లెలు అతి సుగుణవతి అని మురిసి పోయిన క్షణాలు నా జీవితగ్రంథంలో ఏ పుటలో వెదికినా నీకు కనిపిస్తాయి. అన్నయ్యంటే ప్రాణమైనా తీసి ఇవ్వగల అనుబంధాన్ని నీలో చూశాను — నది నంటే పంచప్రాణాలు నీకు. గోపీని కంటికి రెప్పలా కాపాడావు. ఇక రాధ విషయం వేరే చెప్పాలా? అది పుట్టి, కళ్లు తెరిచినప్పటినుంచీ వాళ్లమ్మ ఒడిలో ఎప్పుడు నిద్ర పోయింది? నీ గాఢానురాగంతో పార్వతిని పేరుకు మాత్రమే తల్లిని జేశావు కదా!. . . అలాంటిదానవు. . . కన్నకూతురికంటే మిన్నగా పెంచి పెద్ద జేసిన రాధ కెందుకు అన్యాయం చేశావు? మనసులూ, మమకారాలూ తుంచి, అంత కఠోరంగా ప్రవర్తించడానికి నా చిట్టితల్లి నీ కేం అపకారం చేసింది?. . . చెప్పూ. . . దీనికి జవాబు చెప్పూ?. . ."

ఉత్తరీయంలో ముఖం దాచుకుని కుర్చీలో కూలబడిపోయాడు.

చలనంలేక నిర్వికారంగా మారి పోయిన అత్తయ్యను చూచి ఈ మారు నాలో సానుభూతి చోటు చేసుకో లేదు. దాని స్థానంలో పాత జ్ఞాపకాలేవో పైకి లేచి కమ్ముకున్నాయి.

నిజమే . . .

ఆశలు రాసులు పోసి, ఆపై కోర్కెల అందలంమీద కొలువు దీరి కన్నెమనసు కలలు గంటున్న వయసులో- అత్తయ్య నా కమ్మటి కలలను సమూలంగా నాశనం చేసింది. నందన వనంలో మందారసుమంలా నా జీవితం పరిమళించబోయే తరుణంలో, కోర్కెల కొండమీదనుంచీ అశాంతాల అగాథంలోకి నెట్టివేసిన మాట. . . నిజమే! పాత్ర ఎరిగి దానం చేయమన్న ప్పుడు అలాంటి అత్తయ్యమీదనా నా సానుభూతి?. . . మరి, సుమతీ శతకకారుని మాటేమిటి? అపకారికి ఉపకారము నెపమెన్నక చేయమన్నాడే!

• • •

ప్రకృతిలో వసంతాగమనంలా నా జీవితంలో ఆ కళ్యాణ ఘడియ రానే వచ్చింది!

వన్నీటితో తలంటి పోసి, సాపిడి తీసి జడవేసి, పట్టు ఉడుపులు చుట్టబెట్టి, కాళ్లకు పారాణి రాసి, ముఖానికి పసుపు పూసి, బాసికం కట్టి, చుక్కబొట్టు పెట్టి తుదిమెరుగులు దిద్ది, గాఢంగా గుండెల కద్దుకొంది అత్తయ్య. కంటి అంచులు దాటి కారిన కన్నీటికి ఆమె చూపులే అంత్యోపవ్యాస మిచ్చాయి.

కదిలాను.

నడవలో మంగళారావాల మధుర సంగీతం.

పందిరికింద చెప్పలేనంత కోలాహలం.

బరువుగా పీటమీదికి చేర్చింది అత్తయ్య.

వరుడు ఓరగంట దొంగచూపులు పరసేడు.

అందరి దృక్కోణాలకు కేంద్రమై చాలాసేపు సిగ్గుతెరల్లో కుంచించుకు పోయాను. నిలువునా ఆ కోలాహలాన్ని కలుషితం చేస్తూ, "ఔట్ గావ్" అంటూ పోస్టుమన్ ప్రత్యక్షమయ్యాడు. అందరూ కంగారుపడ్డట్టు అత్తయ్య ముఖంలో అశుభ సూచకమేమీ కనిపించలేదు.

"కబురేమిటి, అత్తయ్యా?" అన్నా మెల్లిగా, నా వెనకజేరిన మరుక్షణంలో.

చిక్కని చిరునవ్వుని పెదవుల నిండుకూ పులిమి "అంత గుర్తించదగిన విషయమేమీ కాదు. కార్డుముక్క వాస్తే పరిపోయే దానికి ఇంత కంగారు పెట్టారు. . . తరవాత చెబుతాగా!" అన్నది.

ఇంతలో శాస్త్రుర్లు గట్టిగా శ్లోకం ప్రారంభించటమూ, ఒక్క పెట్టున మంగళవాద్యాలు సందడించటమూ, అత్తయ్య జడ ఎత్తటమూ, అయ్యగారు ఆ మూడు ముళ్లు వేయటమూ-అన్నీ ఒకే మారు జరిగిపోయాయి.

ఆ తరవాత సరిగ్గా రెండు గంటల కాలాన్ని చోటు చేసుకున్నాయి చదివింపులు. చిట్టచివర అత్తయ్య బంగారు కుంకుమభరిణ చదివిస్తుంటే ఆమెనైపు వింతగా చూశారు శ్రీవారు. ఆమె చిరునవ్వు నవ్వక తప్పింది కాదు. ఉన్నపళంగా దుఃఖం పొంగి రా కేం జేస్తుంది? వెళ్లొస్తానంటూ వీడ్కోలు తీసుకున్న అత్తయ్య, నాలో చెరిగిపోని భావముద్రలు వేయనే వేసింది.

* * *

ఒకటీ. . . రెండూ. . . మూడు రోజులు గడిచిపోయాయి. హఠాత్తుగా అమ్మా, నాన్నా, అన్నయ్యా లేచి కూచున్నారు. ఆ ఉదయం అత్తయ్య దగ్గిరనుంచి ఓ పెద్ద ఉత్తరం అందింది. నాన్న కళ్లలోని భావాన్ని గ్రహించిన శ్రీవారు చదవటం ప్రారంభించారు.

"అన్నయ్యా!

నే నీ ఉత్తరం వ్రాస్తున్నది మీ నుండి సానుభూతి యాచించి మాత్రం కానేకాదు. ఏడాది పర్యంతంగా నా గుండెల్లో ఘనీభవించిన బరువు బాధ కరిగిపోతే అంతే చాలు.

సందర్భరహితంగా ఏమిటీ ప్రస్తావన అని మీ రనుకోకపోతే, నాడు పట్నపు పరీక్షలు పూర్తికాగానే రాధతో తన వివాహం వెంటనే జరిపించమన్నాడు భాను. ఏ కళ నున్నాడో వాడు ఎప్పటి కప్పుడు చెవి నిల్లుగట్టి పోరుతున్నా ససేమిరా కాదన్నవాడు— అప్పు డలా అనేసరికి నా మనసు ఆనందంతో గంతులు వేసింది. ఆ ఊపు ఊపులోనే మీ నుండి నిశ్చయ తాంబూలాలు స్వీకరించాను.

కానీ, అన్నయ్యా! మగదక్షత లేక, ఆడుపాట్లలకు లొంగక పిల్ల లెంతగా భ్రష్టులై పోతారో, భాను దాచిన చీకటి పేజాన్ని వివగా తెలిసింది. వాడి విషయం మీకు తెలియదు. మీకే కాదు, స్వయాన కన్నతల్లినైన నాకే తెలిసిరాలేదు. ఆ దుష్టుడూ, దుర్మార్గుడూ కాలేజీలో అందిన ఆడపిల్లల నెందరినో అనుభవించాడు.

మీ ఇంటినుంచి వచ్చిన మరురోజు భానుకు బాగా మస్తీ చేసింది. చికిత్స ఇప్పించాను. కుటుంబవైద్యుడు చాలా అనుమానంగా చెప్పాడు. ప్రాణసంకట మేలని చెన్నపట్టణం తీసుకువెళ్లాను. అక్కడ నిలువునా నీరయే విషయ మొకటి తెలిసింది. భానుకు పుట్ట కురుపు వ్యాధిట! అది బాగా ముదిరి పోయింది. వా డొట్టే బతకగలడనే ధైర్యాన్ని ఇవ్వలేకపోయారు డాక్టర్లు. నా కప్పు డర్థమైంది, ఇన్నాళ్లుగా వాడు ఇంటికి దూరంగా కాలం ఎందుకు వెళ్లదీశాడో!

ఈ స్థితిలో కూతురులాంటి నా రాధ భవిష్యత్తును దూరదృష్టి అద్దాల్లోంచి చూశాను. అప్పు డొక ఆలోచన నా కర్తవ్యానికి బాసటగా నిలిచింది. వెంటనే ఉన్నదీ, లేనిదీ కల్పించి కర్కశమైన ఉత్తరంతో మీ మనసులు విరిచి, ఈ పెళ్లి తప్పించ

( తరువాయి 55 వ పేజీలో )



పాపం! పసిపాప! ఫోటో—పి. జి. ఎస్. రెడ్డి



పాపం! పాప! ఫోటో—ఎస్. వి. టకల్కర్

# లో వెలుగులు

( 39 వ పేజీ తరువాయి )

దలిచాను. ఎందుకంటావా, అన్నయ్యా! వైధవ్య జీవితం ఎంత బాధాకరమైనదో కొన్నేళ్ళుగా నే ననుభవిస్తున్న కఠోర సత్యం. అలాంటిది. . . తెలిసీ. . .నా చేతులమీదుగా వచ్చే ప్రమాదాన్ని ప్రాణమైన నా రాధ కంటనిస్తానా? పసుపు కుంకుమలతో దీర్ఘసుమంగళిగా నూరు కాలాలపాటు చల్లగా వర్ధిల్లడమే గదా నా క్కావాలి!. . .

భాను పెద్దాసుపత్రిలో చేరి రెండు రోజులు గడిచాయి. మూడో నాడు వాడికీ వ్యాధొక్కటే చాలదన్నట్లు మరొక విపరీతంకూడా కలిసి వచ్చింది.

కాలేజీ వెలగబెడుతున్న చివరి రోజుల్లో ఈ అప్రాచ్యుడు ఓ పెద్దింటి ఆడపడుచును 'లవ్' చేశాడట! ఆ లవ్ మరో ప్రాణికి జన్మ ఇచ్చే ప్రమాదం తప్పించి ఉంటే-పాపం, ఆ తండ్రీకూతుళ్ళు శ్రమపడి అంత దూరం మమ్మన్వేషిస్తూ వచ్చేవాళ్ళు కాదేమో! ఆడది అలుసివ్వకపోతే ఎంతటి మగాడైతే మాత్రం ఏం చేయగలడనే సాధారణ అభిప్రాయం చాలామందితోపాటు నాకూ ఉంది. అలుసనే సామగ్రి అరువిచ్చిన తరవాత పై అభిప్రాయానికి ఆస్కార మెక్కడ?

ఆ వచ్చిన ఇద్దరికీ భాను పరిస్థితి వివరించి చెప్పాను. ఆ మందభాగ్యుడు పేరుమోసిన పెద్ద వకీలట! భానుమూర్తి బ్రతకడనే కుంటిసాకుతో ఆ పెళ్ళి తప్పించ యత్నిస్తే, తన దగ్గిరున్న ఆధారాలతో కోర్టుకెక్కి మరీ పెళ్ళి చేయిస్తానన్నాడు. సందిగ్ధస్థితి ప్రేరేపించే ఉద్రేకంలో మనిషి ఎంత విచక్షణా శూన్యుడౌతాడో! దీన్ని తోసిరాజనగలిగే నిదర్శనం మరొకటి కావాలా!. . . అమావాస్యకు వంకాయలు కాయించటమంటే నువ్వెరుగుదువా, అన్నయ్యా! వాడికి వ్యాధి కాస్త తెరిపి ఇవ్వగానే ఆ దౌర్భాగ్యుడు ఈ పనే జేశాడు. భానుమూర్తికి, మోహినికి చెన్నపట్నం రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి అయిపోయింది. అప్పటికి కోడలికి మూడో నెల!

కానీ, అన్నయ్యా, ఎంత నీతిబాహ్యుడైన కొడుకైనా, కట్టుకొన్న ఇల్లాలికీ, పుట్టిన పసికందుకూ అన్యాయం చేసి వెళ్ళిపోతే ఆ తల్లి పేగులో కదిలిక ఉండదా?

భానుమూర్తి చచ్చిపోయాడు. . . నా కొడుకు. . . చచ్చిపోయాడు. . .

రాధమ్మ పెళ్ళిలో నా పేర వచ్చిన టెలిగ్రామ్ ఇంకేదో కాదు—ఇదే!

ఈ కథంతా ముందే ఎందుకు చెప్పలేకపోయావని నన్ను మీ రడగలేరు. ఎందుకంటే — ప్రారంభంలో ప్రత్యక్ష ప్రయత్నం తరవాత చివరిపారిగా ఈ విషయం విపులీకరిస్తూ ఉత్తరం వ్రాశాను. చూడనైనా చూడకుండా, లాగి చెంపన కొట్టినట్టు తిరుగు టపాలో వాపసు పంపేశారు. సరే, ఇది పద్ధతి కాదనుకొన్నాను. రాధమ్మ పెళ్ళితో గానీ మీ మనసులు కుదుటపడవు. అంతవరకు నే నోపిక పట్టాను. ఆ వాయిదా మొన్నటితో తీరిపోయింది. ఇప్పుడు. . . నా మన స్సెంత తేలిక పడిందనుకున్నావు!. . .

ఇప్పటికే మీ కాలాన్ని వృథాచేసి ఉంటాను. క్షంతవ్యురాలిని. సెలవు.

— నవనీతం.''

శ్రీవారు చదవటం ముగించి దీర్ఘంగా విశ్వసించారు.

ఇప్పుడు అమ్మా, నాన్నా, అన్నయ్యల ముఖాలను తేరిపార చూడాలనిపించింది నాకు. ఎవరిలోనూ కదలిక ల్లేవు. కన్నీళ్ళు మాత్రం ధారాపాతంగా కదిలిపోతున్నాయి.


దాచుకోవడ మెందుకూ. . . నాలో దుఃఖం కట్టలు తెంచుకొని భోరున ఏడ్చేశాను. ''నా కోసం ఇంత త్యాగం చేశావా, అత్తయ్యా!''

''రాధా!''

చివాలున చూశాను.

గాంభీర్యంలో నెలకొన్న మౌనాన్ని పెకలిస్తూ పెదవి కదిపారు శ్రీవారు.

''ఒకనాడు. . . అకస్మాత్తుగా మా రంగనాథం బాబాయి కన్ను మూశాడు. ఆయన మిగిల్చిపోయిన మంచితనాన్ని ఆ తరవాత మా పిన్నిలో చూశాను నేను. అదే, పరాయి దేశాలకు వెళ్ళే అవకాశాన్నికూడా అలక్ష్యం చేసి నన్నో బంధానికి సుముఖుణ్ణి చేసింది. ఈ పెళ్ళి అనే బృహన్నాటకం వెనక సూత్రధారిణికూడా మా పిన్నే! అంటే, మీ నవనీతం అత్తయ్యే!. . .'' ★



అన్నీ చక్రాలే

ఫోటో—ఐ. పాండురంగారావ్ (నెల్లూరు)